


25న సిఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

దెందులూరు: ఈనెల 25న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వైఎస్ఆర్ ఆసరా–3 ప్రారంభోత్సవానికి దెందులూరు వస్తున్న సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సభాస్థలి పనులు ప్రారంభం కాగా, ముఖ్యమంత్రి భద్రత విషయంలో అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఎంఎల్‌సి, సిఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలశిల రఘురామ్ నేతృత్వంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ ఎం.అరుణ్‌బాబు, మాజీ డిప్యూటీ సిఎం ఆళ్ల నాని, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సభా స్థలం, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ స్థలాలు పరిశీలించారు. అనంతరం అన్ని శాఖల జిల్లా అధికారులతో, ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి సభ విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు లీలా నవకాంతం, ఎంపిపి సుశీల, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు ప్రసాదరావు, దెందులూరు కో ఆర్డినేటర్ తమ్మయ్య, పాల్గొన్నారు.

పేదల భూములు పెద్దల చేతుల్లోనే..!

దోసపాడు దళితుల భూముల ఆక్రమణపై అధికారుల స్పందన కరువు


వందల ఎకరాల అసైన్డ్ భూములు దర్జాగా అనుభవిస్తున్న బడాబాబులు

తమ భూములు అప్పగించాలని దళితుల అలుపెరగని పోరు

కనీస చర్యలు చేపట్టని రెవెన్యూ అధికారులు

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదై మూడు నెలలైనా అరెస్టులు నిల్

తాడోపేడో తేల్చుకునేందుకు నిరవధిక దీక్షలకు బాధితులు సిద్ధం



అవి అసైన్డ్, సీలింగ్ భూములని అధికారులకు తెలుసు. ఆ భూములన్నీ పేద దళితులకు ప్రభుత్వం ఇచ్చినట్లు అధికార యంత్రాంగం వద్ద అన్ని ఆధారాలూ ఉన్నాయి. దెందులూరు మండలం దోసపాడులో దళితులకిచ్చిన భూములను బడాబాబులు ఆక్రమించుకున్నట్లు కళ్ల ముందు కన్పిస్తోంది. తమ భూములు తమకు ఇప్పించాలని పేదలైన దళితులు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. దళితులను బెదిరిస్తున్న వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదై మూడు నెలలైనా అరెస్టు చేయని పరిస్థితి ఉంది. పెద్దల చేతుల్లో ఉన్న పేదల భూములను స్వాధీనం చేసుకుని పేదలకు అప్పగించడంలో అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

దెందులూరు మండలం దోసపాడు గ్రామంలో దళితులకిచ్చిన అసైన్డ్, సీలింగ్ భూములు దాదాపు 350 ఎకరాల వరకూ నున్నాయి. 1957 నుంచి దఫదఫాలుగా ఈ భూములను దళితులకు ప్రభుత్వం ఇచ్చినట్లు రికార్డులు చెబుతున్నాయి. సర్వే నెంబర్లు 208, 213, 214, 216, 225, 226, 227, 231, 232ల్లోని భూమిని ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసింది. ప్రస్తుతం ఈ భూములన్నీ విజయవాడకు చెందిన దేవినేని బాజీప్రసాద్, ఆయన అనుచరుల చేతుల్లో ఉన్నాయి. ఈ భూముల్లో చేపల చెరువులు తవ్వి చేప, రొయ్యల సాగు చేస్తూ దర్జాగా అనుభవిస్తున్నారు. నిబంధనల ప్రకారం అసైన్డ్, సీలింగ్ భూములకు సంబంధించి అమ్మకాలు, కొనుగోలు చేయకూడదు. పేదల నుంచి ఆ భూములను బలవంతంగా లాక్కుని దేవినేని బాజీప్రసాద్, ఆయన అనుయాయులు అనుభవిస్తున్నారు. తమ భూములు తమకు అప్పగించాలని దాదాపు వంద కుటుంబాలకుపైగా కొంతకాలంగా అలుపెరగని పోరాటం చేస్తున్నాయి. పాదయాత్రలు, కలెక్టరేట్ వద్ద ధర్నాలు ఇలా అనేక రూపాల్లో తమ నిరసనలు తెలియపరుస్తూ వస్తున్నారు. తహశీల్దార్, జెసి, జిల్లా కలెక్టర్ వరకూ అందరినీ కలిసి తమగోడు చెబుతున్నారు. అయినప్పటికీ పేదలైన దళితులకు న్యాయం జరగని పరిస్థితి ఉంది. ఈ భూములకు సంబంధించి పేదలు లోకాయుక్తను ఆశ్రయించగా 2015లో ఈ భూములను అసైన్డ్‌దారులైన దళిత పేదలకు అప్పగించాలని ఆదేశించింది. ఇప్పటికీ రెవెన్యూ అధికారులు ఆ ఆదేశాలు అమలు చేయని పరిస్థితి ఉంది. పేదలను బెదిరిస్తున్న వారిపై దళితులు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు పెట్టారు. ముప్పూడి శ్రీనివాస్ మరో ఐదుగురిపై ఈ కేసు నమోదైంది. మూడు నెలలైనా ఇప్పటికీ వారిని అరెస్టు చేయలేదు. రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం బడాబాబులకు కొమ్ముకాస్తున్నట్లు జరిగిన పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. అధికారులు జెసి కోర్టులో ఉందని చెబుతున్నారు. జెసి కోర్టులో వెంటనే విచారణ పూర్తి చేసి తమకు న్యాయం చేయాలని దళితులు కోరుతున్నారు.

లీజు ఎవరికిస్తున్నారో తేలిస్తే నిజం బట్టబయలు

భూములను అనుభవిస్తున్న ఆక్రమణదారులు ఈ భూములకు సంబంధించి దళితులకు లీజు ఇస్తున్నట్లు తప్పుడు పత్రాలను అధికారులకు, కోర్టులకు సమర్పిస్తున్నారు. లీజు ఎవరికి ఇస్తున్నారు, ఎంతిస్తున్నారు వంటి ఆధారాలను అధికారులు బయటికి తీస్తే నిజం బట్టబయలవుతుంది. అధికారులు మాత్రం అవేమీ పట్టించుకోవడం లేదు. తమ భూముల కోసం పోరాటం చేస్తున్న దళితులపై ఎదురు కేసులు పెడుతున్న పరిస్థితి ఉంది. అంతేకాకుండా గ్రామంలోని దళితులను రెచ్చగొడుతున్నారంటూ వారికి అండగా నిలిచి పోరాటం చేస్తున్న వ్యవసాయకార్మిక సంఘం నేతలపై ఎదురుదాడికి దిగుతున్నారు. చట్టప్రకారం అన్ని ఆధారాలున్నా భూములను దళితులకు అప్పగించకుండా ఆక్రమణదారులకు కొమ్ముకాయడం వెనుక ఆంతర్యం ఏమిటా అనే చర్చ సర్వత్రా సాగుతోంది. దీంతో తమకు న్యాయం చేయాలని కోరుతూ దళితులు నిరవధిక దీక్షలకు సైతం సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దళితులకు న్యాయం చేసి ఆదుకోవాల్సి ఉంది.

ఆశాల పోరు.. హోరు..!

సమస్యలపై కదంతొక్కిన కార్యకర్తలు - తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లావ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు కదంతొక్కారు. తహశీల్దార్ కార్యాలయాల వద్ద పెద్దఎత్తున ధర్నాలు చేపట్టారు. ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మరణించిన కుటుంబానికి రూ.30 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, పనిభారం తగ్గించాలని, కార్యకర్తలపై రాజకీయ నాయకుల ఒత్తిడి, వేధింపులు ఆపాలని, అత్యవసర సమయంలో వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని ఆశాలు డిమాండ్ చేశారు.



నూజివీడు మండలంలో..

ఏలూరు: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి వీరంకి సాయిబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షుడు బి.జగన్నాధరావు, ఆల్‌ఇండియా పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు విజిఎంఆర్.కృష్ణారావు, ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాలు



ఏలూరులో..

దేవి, శివ శంకరి, బి.గీతా భవాని, లోకేశ్వరి, వి.నవ్యారాణి, మరియమ్మ, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు

ద్వారకాతిరుమల : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మండలంలోని ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిని అందించారు. ఈ సందర్భంగా ఆశావర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు లలితకుమారి మాట్లాడుతూ ఆశాలతో గొడ్డుచాకిరీ చేయించుకుంటున్న ప్రభుత్వం వారి సమస్యలను మాత్రం పరిష్కరించడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.ధనలక్ష్మి, డి.దుర్గ, రాజేశ్వరి, లక్ష్మి పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు పట్టణ కార్యదర్శి ఎస్‌కె.సుభాషిని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎస్.నాగదుర్గ అధ్యక్షతన ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్.లక్ష్మీ పావని, సుజాత, కలపాల నాగమణి, టి.అరుణ, శకుంతల, రమాదేవి, పి.అరుణ, జయ నాగేశ్వరి, కనకదుర్గ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్లు ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి మాట్లాడుతూ ఆశాలకు పనిభారం తగ్గించాలని, సంబంధం లేని పనులు చేయించొద్దని, అక్రమ తొలగింపులు, వేధింపులు ఆపాలని, రాజకీయ జోక్యం తగదని, విధి నిర్వహణలో మరణించిన కుటుంబాలకు ఆశా వర్కర్స్ నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని, డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఆశా వర్కర్లు కొయ్య పోచమ్మ, మడకం శాంతకుమారి, గురివింద మంగతాయారు, సరియం గంగాదేవి, గుండి గంగాదేవి, తెల్లం వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

భీమడోలు : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిఐటియు జిల్లా అధ్యక్షులు



జంగారెడ్డిగూడెంలో..

లింగరాజు మాట్లాడారు. అనంతరం వినతిపత్రాన్ని తహశీల్దార్ షంషుద్దీన్‌కు అందజేశారు.

చాట్రాయి : తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఆశాలు ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ నాగార్జునకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కొలికిపోగు భాస్కర్‌రావు, నాయకులు ఎస్.పుల్లమ్మ, బి.వేరోనికమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : ఆశాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ ఆశాలకు సంక్షేమ పథకాలను, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం నుంచి ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డి.తులసి, ఎస్.రత్నం, రాచూరి అంజలి, ఎర్రమల్ల విజయలక్ష్మి, సుజాత, జగతి, సుమలత, నాగమణి, లక్ష్మి, పి.నాగమణి, సుజాత, పార్వతి, వరలక్ష్మి, సంతోషం, పద్మావతి, విజయలక్ష్మి, సుజాత, స్వరూప పాల్గొన్నారు.

టి.నరసాపురం : ఆశాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక అంబేద్కర్ సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ఆశాలు ర్యాలీ నిర్వహించారు. ముందుగా సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వినతిపత్రాన్ని డిటికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సత్యనారాయణ, తుమ్మల సత్యనారాయణ, ఆశా వర్కర్ల సంఘం నేతలు వై..విజయలక్ష్మి, ఇ.లక్ష్మి, ఎన్.జ్యోతి, జి.వజ్ర కుమారి పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ ఎలీషాకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కొండలరావు, ఆశా కార్యకర్తలు రమణ, నగ్మ, రత్నకుమారి,శబరి పాల్గొన్నారు.

నిడమర్రు : సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రాన్ని తహశీల్దారు సాయిరాజుకు అందించారు. కంచం సుబ్బలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు, నాయకులు కోన శ్రీనివాసరావు, వెలగలేటి మోహన్, ఎ.పద్మ, ఆర్.మార్తమ్మ, వి.లక్ష్మి పాల్గొన్నారు.

ముసునూరు: సిఐటియు జిల్లా నాయకులు జి.రాజు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్ దాసరి సుధకు వినతిని అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిల్లి మురళీ, పి.సునీత, బి.రేణుక, డి.రాధ మ్మ, మల్లమ్మ, టి.దివ్య, ఎం.వాణి, ఎన్.రత్నకుమారి, ఎం.కుమారి, ఎం.స్వర్ణకుమారి, ప్రభావతి పాల్గొన్నారు.

కలిదిండి : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ధర్నా


జీలుగుమిల్లిలో..

నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు శేషపు మహంకాళరావు, వ్యకాస మండల కార్యదర్శి జక్కుల మహేష్, ఆశా వర్కర్ల యూనియన్ కార్యకర్తలు దాసరి విజయ, సిహెచ్.రజిత, దేవి, డి.సంతోషి, జె.నిర్మల, బేబీలక్ష్మి, ఎం.సుజాత, మాధవి, పి.విజయ లక్ష్మి, ఎస్తేరు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అశా కార్యకర్తలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నూజివీడు పట్టణ అధ్యక్షులు ఎన్‌ఆర్.హనుమాన్ మాట్లాడుతూ పోరాడితేనే హక్కులు సాధించుకోగలమన్నారు. ప్రభుత్వం స్పందించి వారి డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కర్రి కుమారి, పుట్టి కమల, ఉపాధ్యక్షురాలు విఅర్.స్వాతి, సభ్యులు, ఐ.నాగమణి, ఎ.అన్నపూర్ణ, నూజివీడు మండల కార్యదర్శి కె.కనకదుర్గ, ఆశాలు పాల్గొన్నారు.



కలిదిండిలో..


మాట్లాడుతున్న ఎ.రవి

చలో ఢిల్లీ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఉపాధి హామీ చట్ట పరిరక్షణకు వచ్చేనెల ఐదో తేదీన జరిగే చలోఢిల్లీ కార్యక్రమానికి ఉపాధి కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని తాడువాయి జమ్మిచెరువులో ఉపాధి హామీ కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి హామీ బకాయిలు ఐదు వారాల డబ్బులు రూ.ఆరు లక్షల వరకూ చెల్లించాలని డిమాండ్ చేశారు. మండలంలో మరో రూ.40 లక్షల వరకూ వేతన బకాయిలు రావాల్సి ఉందని తెలిపారు. తక్షణం వేతనాలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు బడ్జెట్‌లో రూ.30 వేల కోట్లు తగ్గించారని విమర్శించారు. ఫలితంగా పని దినాలు తగ్గిపోతాయన్నారు. ఇది ముమ్మాటికీ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యానికేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే వ్యవసాయ కూలీలకు గ్రామాల్లో పనుల్లేక ఇతర జిల్లాలకు వలసలు వెళుతున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన నిత్యావసర సరుకుల ధరలు, వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలతో సాధారణ ప్రజలు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మానుకొండ జీవరత్నం పాల్గొన్నారు.

దెబ్బతిన్న పొగాకు పంటల పరిశీలన

జంగారెడ్డిగూడెం: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న వర్జీనియ పొగాకు పంటలను పొగాకు బోర్డ్ డైరెక్టర్ శ్రీధర్‌బాబు మంగళవారం పరిశీలించారు. అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన పొగాకు రైతులను ఆదుకోవాలని పొగాకు రైతు సంఘం నాయకులు పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్ బాబును కోరారు. మూడు రోజుల నుండి కురిసిన వడగండ్ల వానకు పొగాకు తోటలు ధ్వంసమైన నేపథ్యంలో పొగాకు రైతు సంఘాల అధ్యక్ష, కార్యవర్గం, సీనియర్ పొగాకు రైతు సంఘం నాయకులు కరాటం రెడ్డిబాబు విజ్ఞప్తి మేరకు శ్రీధర్‌బాబును పొగాకు పంటలను పరిశీలించారు. జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల పరిధిలో తీవ్రంగా నష్టపోయిన పొగాకు తోటలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పొగాకు బోర్డు అధికారులు, రైతు సంఘం నాయకులతో మాట్లాడుతూ నష్టాన్ని అంచనా వేసి నివేదికను గుంటూరు కేంద్ర కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. నష్టపోయిన రైతులు ఆందోళన చెందొద్దని బోర్డు అధికారులు, ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పొగాకు రైతు సంఘం నాయకులు శ్రీధర్ బాబుకు వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు ఒంగోలు రీజనల్ మేనేజర్ కృష్ణశ్రీ, రాజమండ్రి రీజనల్ మేనేజర్ ప్రసాద్, ఎస్‌జిఒ శకుంతల, సుధీర్, పార్వతి, ఫీల్డ్ ఆఫీసర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఎన్‌ఎల్‌ఎస్ పొగాకు బోర్డు రైతు నాయకులు పరిమి రాంబాబు, సత్రం వెంకటరావు, వామిసెట్టి హరిబాబు, అట్లూరి సతీష్, ప్రకాశరావు, రైతులు పాల్గొన్నారు.

రాగిజావతో ఆరోగ్యం : కలెక్టర్

ఏలూరు: రాగిజావతో పిల్లలకు ఐరన్, కాల్షియం, మెగ్నీషియం వంటి పోషకాలు అందుతాయని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సిఎం జగన్ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి వర్చువల్‌గా రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఏలూరు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి విద్యాశాఖ అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులతో కలిసి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ హాజరయ్యారు. ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో కలిసి విద్యార్థులకు రాగిజావ అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యానికి రాగిజావ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

వెంకటస్వామి ఆశయ సాధనకు కృషి చేయాలి : సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు ఉద్యమించడమే అమరజీవి వెంకటస్వామికి మనం అర్పించే నివాళి అని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. యుటిఎఫ్ ఆవిర్భావ నేత, అమరజీవి వెంకటస్వామి వర్ధంతి సభ మంగళవారం ఏలూరు యుటిఎఫ్ కార్యాలయంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాబ్జీ మాట్లాడుతూ నేడు ప్రభుత్వ విద్యారంగం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. ఉపాధ్యాయుల స్థితిగతులు దారుణంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుంటూనే ప్రభుత్వ విద్యారంగం కోసం కృషి చేస్తున్న ఉపాధ్యాయుల స్థితిగతుల కోసం యుటిఎఫ్ నేతలు పనిచేయాలన్నారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు వేధింపులు, సాధింపుల ధోరణితో పని చేస్తూ ఉపాధ్యాయులని తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తున్నారని, ఇది చాలా అనారోగ్యకరమైన పరిస్థితి అని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల పిఆర్‌సి బకాయిలు, డిఎ బకాయిలు, సరెండర్ లీవ్ సొమ్ములు, మెడికల్ బిల్లులు ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.నరసింహారావు మాట్లాడుతూ వెంకటస్వామి ఉపాధ్యాయుల ఉద్యమానికి ఊపిరిపోశారని, ఆయన ఆశయసాధనలో నాయకులు, కార్యకర్తలు మరింత క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఎంవి.శ్యామ్‌బాబు, సహాధ్యక్షులు బి.సుభాషిణి, కోశాధికారి షేక్ ముస్తఫా ఆలీ, కార్యదర్శులు ఎ.విక్టర్, ఎన్.రాంబాబు, ఎస్.సుధారాణి, సిహెచ్.శ్రీధర్, కె.కమల్ కుమార్, శివశంకర్, జి.రాజేంద్రప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వి.కనకదుర్గ, ఆంజనేయులు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎంవి.బేతాళరావు, తేరా ప్రసాద్, రంగమోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాబ్జీ

అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అకాల వర్షాలు, ఈదురు గాలులు, వడగండ్ల వానతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని తాడువాయిలో ఎపి రైతుసంఘ నాయకులు పర్యటించి అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులను అడిగి పంటనష్టం వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో అకాల వర్షాలు, ఈదురు గాలులు, వడగండ్ల వానలతో పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్జీనియా పొగాకు, మొక్కజొన్న, మామిడి, జీడి మామిడి, అరటి, మిర్చి తదితర పంటలకు వేలాది ఎకరాల్లో నష్టం వాటిల్లిందని చెప్పారు. అప్పులు చేసి పంటలకు పెట్టుబడి పెట్టిన రైతులు నష్టపోయి దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారని చెప్పారు. పంటలకు జరిగిన నష్టాలను నమోదు చేసి పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. 33 శాతం పైగా నష్టం జరిగితేనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలనే ప్రభుత్వ నిబంధనలు సవరించి ఎంత మేరకు నష్టం జరిగితే అంత మేరకు నష్టాన్ని నమోదు చేసి సబ్సిడీ అందించాలన్నారు. అన్ని పంటలకు బీమా వర్తింపజేయాలన్నారు. నష్టపోయిన రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, తాడువాయి ఫ్యాక్టరీ పరిధి చెరకు రైతు సంఘం అధ్యక్షులు అనపర్తి వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: అకాల వర్షాలు, వడగండ్ల వానతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ములగలంపల్లి, పాములవారిగూడెం గ్రామాల్లో అకాల వర్షాలు, వడగండ్ల వానకు దెబ్బతిన్న వర్జీనియా పొగాకు తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వందలాది ఎకరాల్లో వర్జీనియా పొగాకు, మొక్క జొన్న పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఎకరాకు లక్ష రూపాయల వరకూ


దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శ్రీనివాస్

రైతులకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ములగలంపల్లి రెవెన్యూ పరిధిలో దాదాపు వంద ఎకరాలకుపైగా వర్జీనియా పొగాకు తోటలు దెబ్బతినగా రైతులు రూ.రెండు కోట్లకు పైగా నష్టపోయారని చెప్పారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, పొగాకు బోర్డు స్పందించి నష్టపోయిన పొగాకు రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, మండల కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య, ఉపాధ్యక్షులు బిక్కిన వీరసత్యం, నాయకులు సింహాద్రి శ్రీనివాసరావు, రైతులు మాదినేని శివశంకర ప్రసాద్, అడ్డగర్ల గణేష్, మోత్కుపల్లి అయ్యప్ప, వై.హరిబాబు పాల్గొన్నారు.

టి.నరసాపురం: మండలంలోని తిరుమలదేవిపేటలో అకాల వర్షాలవల్ల నేలకొరిగి నష్టం వాటిల్లిన పంటలను ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సంఘం జిల్లా నాయకులు తుమ్మల సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలకు చేతికొచ్చిన మొక్కజొన్న, అరటి, నిమ్మ, జీడిమామిడి తోటలు దెబ్బతిన్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇప్పటికే విత్తనాలు, పురుగుమందులు, వ్యవసాయ పనిముట్లు, డీజిల్ ధరలు పెరిగి, పెట్టుబడులు పెరిగి కౌలురైతులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని వాపోయారు. నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.



కలెక్టర్‌కు వినతిని అందిస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలని
చేతివృత్తిదారుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు

చేతివృత్తిదారులకు రాష్ట్ర బడ్జెట్లో రూ.50 వేల కోట్లు కేటాయించాలని, సామాజిక రక్షణ చట్టం చేయాలని, 56 చేతి వృత్తులకు నిధులు కేటాయించి సక్రమంగా ఖర్చు చేయాలని, సమగ్ర కుల గణన చేయాలని కోరుతూ ఎపి చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, జిల్లా కోకన్వీనర్ ఆగొల్ల వెంకట కృష్ణారావు, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, మల్లిపూడి రాజు, పి.ప్రతాప్, వృత్తిదారుల సంఘం నాయకులు వి.కిషోర్ నాయకత్వాన ప్రతినిధి బృందం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు వినతిని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతీవృత్తిదారుని కుటుంబ సంక్షేమం కోసం రూ.25 వేలు ఆర్థిక సహాయం నగదు బదిలీగా అందించాలని కోరారు. నెలకు 200 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇవ్వాలని, వృత్తి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన వాకి కుటుంబానికి రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వృత్తిదారుల ఫెడరేషన్ కార్పొరేషన్లకు విధులు నిర్ణయించి నిధులు కేటాయించి ఖర్చు చేయాలన్నారు. మత్స్యకారుల జీవితాలను నాశనం చేసే 217 జిఒను రద్దు చేయాలని 343 జిఒ ప్రకారం పంచాయతీ చెరువులు స్థానిక మత్స్యకారుల సొసైటీలకు నామమాత్రపు లీజుకు ఇవ్వాలని కోరారు. చేనేతపై జిఎస్‌టి పూర్తిగా రద్దు చేయాలని, ప్రతి చేనేత కార్మికునికీ నేతన్న నేస్తం పథకాన్ని వర్తింపచేయాలని, మగ్గం షెడ్డుతో కూడిన ఇల్లు ప్రభుత్వమే ఉచితంగా నిర్మించి ఇవ్వాలని కోరారు. కల్లుగీత వృత్తి అభివృద్ధికి నిపుణులతో కమిటీ వేయాలన్నారు. గీత కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలని, బడ్జెట్‌లో రూ.ఐదు వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

పెట్రో, గ్యాస్ ధరలు తగ్గించాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మోటార్ వాహనాల చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలని, పెట్రో ధరలు తగ్గించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్ల బోయిన రాంబాబు డిమాండ్ చేశారు. రాజవరం, ఎర్రంపేట, గంగవరం పొయింట్ల శ్రీ వరసిద్ధి వినాయక ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశం పోతిని చిన్న అచ్చారావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాంబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో కార్మికులపై ఫీజులు, పెనాల్టీలు, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, లైఫ్‌ట్యాక్స్ పెంచుతున్నారు. లైఫ్ టాక్స్ భారాన్ని తగ్గించాలని, పెట్రోల్ డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి సత్యనారాయణ, శ్రీను, శంకరపు సుబ్బారావు, జయరాజు, గంగపట్ల నాగేశ్వరరావు, ముప్పిడి శ్రీను, రేలంగి రాజు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని పర్వతాపురం గ్రామంలోని దళితవాడకు చెందిన కల్లేపల్లి మార్తమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. ఆమె భర్తకు వైఎస్ఆర్ బీమా కింద తక్షణ సాయంగా రూ.పది వేలు గ్రామ సర్పంచి మిద్దె శివరామకృష్ణ మంగళవారం అందించారు. మిగిలిన రూ.90 వేలు మృతురాలి భర్త ఖాతాలో పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్, వాలంటీర్, పాల్గొన్నారు.

23న భగత్‌సింగ్ వర్ధంతి సభ

ప్రజాశక్తి - ఏలూరు

విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23వ తేదీన స్థానిక కొత్త బస్టాండ్ పక్కన సిఐటియు కార్యాలయంలో పిడిఎస్ఒ ఎన్‌వైఎస్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు పిడిఎస్ఒ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.మోహన్ మంగ ళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్య ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ మూల ంగా విద్యార్థులు చదువు ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొ న్నారు. దేశంలో నిరుద్యోగం రోజురోజుకు పెరిగిపోతున్నప్పటికీ ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాత్సారం చేస్తున్నాయని తెలిపారు. 23న నిర్వహించే భగత్‌సింగ్ వర్ధంతి సభలో డాక్టర్ శ్రీనివాస్, ఎన్‌వైఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కె.బాషు, పిడిఎస్ఒ రాష్ట్ర కార్యదర్శి సురేష్ పాల్గొంటారని తెలిపారు.

పోషణ సంబరాలు జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోషణ సంబరాలు జయప్రదం చేయాలని డివిజన్ కార్పొరేటర్ జుజ్జువరపు విజయనిర్మల కోరారు. స్థానిక 16వ డివిజన్‌లో నాలుగో సెక్టార్‌లో అంగన్‌వాడీ సెంటర్‌లో పోషక సంబరాలు మంగళవారం టి.రజిని అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ విజయనిర్మల మాట్లాడుతూ డివిజన్‌లో ఏ ఒక్కరు కూడా పోషకాహార లోపంతో ఉండకూడదన్నారు. సూపర్‌వైజర్ పి.సుజాత మాట్లాడుతూ బాలింతలకు, గర్భిణులకు, తల్లులకు, పిల్లలకు పోషకాహారం పట్ల అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం కె.నీలిమ, సచివాలయ సిబ్బంది ఎంఎస్‌కె జి పద్మావతి, అంగన్‌వాడీ టీచర్లు, బాలరాజ్ కుమారి, సిహెచ్‌కెఎల్ కుమారి పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి - చింతలపూడి

రాఘవపురం పిహెచ్‌సి పరిధిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తామని ఎంపిపి రాంబాబు అన్నారు. మండలంలోని రాఘవాపురం పిహెచ్‌సిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం మంగళశారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిలో ఏర్పాటు చేయాల్సిన మౌలిక సదుపాయాలు కల్పన, అభివృద్ధి పనులు, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం, పలు అంశాల గురించి చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో సర్పంచి వజ్రకిషోర్, తహశీల్దార్ కృష్ణజ్యోతి పాల్గొన్నారు.

రీ సర్వేపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష సర్వేపై మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి మాట్లాడుతూ సర్వేలో భాగంగా గ్రామకంఠంలో ప్రతి ఇల్లును, ప్రభుత్వ ఆస్తులను, ఖాళీ స్థలాలను కొలవాలన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి పివి.సత్యనారాయణ, జిల్లా నోడల్ అధికారి నవీన్‌కిరణ్ పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - టి.నరసాపురం

గ్రామీణ ప్రాంత ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని పేరా మెడికల్ ఆఫ్తాలిక్ ఆఫీసర్ సురేంద్ర బాబు తెలిపారు. మండలంలోని మర్రిగూడెం సచివాలయంలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. 60 మందికి కళ్లజోళ్లు , పది మందికి కంటి ఆపరేషన్లు చేయాలని గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్టు

రూ.5 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

గంజాయి తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.ఐదు లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నూజివీడు డిఎస్‌పి అశోక్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... అక్రమంగా గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం అందడంతో జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ ఆదేశాల మేరకు రూరల్ సిఐ ఆర్.అంకబాబు ఆధ్వర్యంలో రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ పోలీస్, రెవెన్యూ డిటి సిబ్బందితో కలిసి నూజివీడు, హనుమాన్ జంక్షన్ ప్రధాన రహదారిలో మర్రిబందం వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఈ తనిఖీలను గమనించిన ద్విచక్రవాహనంపై వస్తున్న ముగ్గురు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకొని వారి వద్ద నుంచి సుమారు ఒక కిలో లిక్విడ్ గంజాయి, నాలుగు కిలోల గంజాయి, మోటార్ సైకిల్, ఐదు ఎటిఎం కార్డులు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులు గుంటూరుకు చెందిన షేక్ ఫయాజ్, షేక్‌గౌస్, విశాఖపట్నం జిల్లా హుకుంపేట మండలం రంగశీలకు చెందిన తాంగుల బుద్దుల అని తెలిపారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

పాము కాటుకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. వివరాల ప్రకారం.. ముదినేపల్లిలోని అంబేద్కర్‌గర్‌కు చెందిన దూబ సుమన్ (41) బైక్‌లకు, ఆటోలకు సీట్ కవర్లు కుట్టుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల ఎనిమిదో తేదీ ఇంటి పెరట్లో ఉన్న చిక్కెడు పాదు వద్దకు వెళ్లి కాయలు కోస్తుండగా విషపూరితమైన పాము కాటుకు గురయ్యాడు. కుటుంబసభ్యులు అతడిని విజయవాడలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు నిస్సహాయత వ్యక్తం చేయడంతో చేసేదిలేక సోమవారం రాత్రి ముదినేపల్లిలోని ఇంటికి తీసుకురాగా మంగళవారం ఉదయం ఇంటి వద్ద మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సుమన్ మరణంతో గ్రామంలో విషాధఛాయాలు అలుముకున్నాయి. మృతదేహన్ని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శేవా నాగజగన్‌బాబూరావు, మాదిగ దండోరా ఏలూరు జిల్లా అధ్యక్షులు ఏసుపోగు దానియేలు, టిడిపి నేత కొడాలి వినోద్ సందర్శించి అంజలి ఘటించి కుటుంబసభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. గ్రామ అంబేద్కర్ యూత్‌సభ్యులు సుమన్ అంత్యక్రియల కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు.

జల కాలుష్య నివారణకు కృషి చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ఆ సంస్థ, కాలుష్య నివారణ మండలి వారు సంయుక్తంగా మంగళవారం ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలుష్య మండలి ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని సంబంధిత అధికారులకు జల కాలుష్య నివారణకు తగు సూచనలు చేస్తున్నామని చెప్పారు. ఫ్యాక్టరీల నుంచి విడుదల చేసే వ్యర్థ పదార్థాలను శుద్ధి చేసిన తర్వాత మాత్రమే విడుదల చేయాలని సంబంధిత ఫ్యాక్టరీ యాజమాన్యానికి సూచిస్తున్నట్లు తెలిపారు. పంటల పైన అత్యధికంగా పురుగుల మందును వాడటం వల్ల ఈ నీటి కాలుష్యం ఎక్కువగా జరుగుతుందని, సేంద్రియ ఎరువులను విరివిగా ఉపయోగించాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో విరివిగా మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారన్నారు. అటువంటి ప్లాంట్లు పైన అధికారులు తనిఖీ తరచుగా నిర్వహించాలని, ప్లాంట్లను ఏర్పాటు చేయటానికి ముందుగా ప్లాంట్లకు ఉపయోగించే నీటిని పరీక్షించిన తర్వాతే అనుమతులు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, శాశ్వత ప్రజా సేవల న్యాయ పీఠం చైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్‌కుమారి, ఇరిగేషన్, మున్సిపల్, గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ వారు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో కుండపోత వర్షం

రోడ్లు జలమయం
వాహనదారుల అవస్థలు
నీటమునిగిన మినుము పైరు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లిలో మంగళవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. గంటకు పైగా కురిసిన కుండపోత వర్షానికి ముదినేపల్లిలోని రహదారులన్నీ జలమయం అయాయి. గ్రామంలోని అంతర్గత రోడ్లతో పాటు ప్రధాన ఆర్అండ్‌బి రహదారులపై నీరు మోకాలు లోతు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. గుడ్లవల్లేరు రోడ్డు మలుపు నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు కిలో మీటర్ మేర రోడ్డుపై నీరు నిలిచిపోయి సంద్రాన్ని తలపిస్తోంది. పోలీస్‌స్టేషన్‌రోడ్డులో మోకాలు లోతుకు పైగానీరు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడ్డారు. రోడ్లు వర్షపు నీటితో నిండిపోవడంతో రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు చేరడంతో దారి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. మండలంలోని అల్లూరు, గురజ, కొరగుంటపాలెం, రాజానగరం ఈడేపల్లి బొమ్మినంపాడు పలు గ్రామాల్లో కుండపోతగా వర్షం పడింది. చేల్లో ఉన్న మినుము పైరు పూర్తిగా మునిగింది. గత ఐదు రోజులుగా కురిసిన వర్షం కన్నా మంగళవారం కురిసిన కుండపోత వర్షంతో రైతులు పంటపై పూర్తిగా ఆశలు వదులుకున్నారు.



ముదినేపల్లిలో రోడ్లపై నిలిచిన వర్షపు నీరు

వ్యాయామం, క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

యోగా, వ్యాయామం, క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని, ప్రతిఒక్కరు వీటిలో పాల్గొనడం ద్వారా ఆరోగ్యం పరిరక్షించుకోవచ్చని అప్‌ల్యాండ్ క్షత్రియ సేవా సమితి అధ్యక్షులు గోరింట విజయ రామరాజు అన్నారు. స్థానిక అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్క్ లో వ్యాయామ, యోగా అభిలాషులకు ఉగాది సందర్భంగా షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మంగళవారం నిర్వహిం చారు. టోర్నమెంట్ ముగింపులో భాగంగా అల్లూరి సీతారా మ రాజు మున్సిపల్ పార్క్‌లో బిఎస్ఎన్ఎల్ విశ్రాంత అధి కారి బోడా సత్యనారాయణ అధ్యక్షతన ఘనం గా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన గోరింట విజయ రామరాజు మాట్లాడుతూ పార్క్ అభివృద్ధికి క్షత్రియ సేవా సమితి చేసిన కృషి వివరించారు. ఈ కార్య్రక్రమంలో క్షత్రియ సేవా సమితి గౌరవాధ్యక్షులు పెన్మెత్స రంగరాజు, కార్యదర్శి నంబూరి రామచంద్రరాజు, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ ముదునూరి నరసింహరాజు, విశ్రాంత ఎఎస్ఐ షేక్ చిన్న దాదా సాహెబ్, విశ్రాంత డిఎఫ్ఒ కాసగాని సత్యనారా యణ భరద్వాజ, అట్లూరి వెంకట రామరాజు ప్రసంగిం చారు. పార్క్‌లో జిమ్, షటిల్ కోర్టు, యోగా రూమ్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. ఆనంతరం అల్లూరి సీతారామరాజు వాకర్స్ మున్సి పల్ పార్క్ ఫ్రెండ్లీ ఉగాది సెటిల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందించారు. పురుషుల డబుల్స్‌లో మొదటి బహుమతి అట్లూరి వెంకట రామరాజు జట్టు, ద్వితీయ బహుమతి పేరిశెట్టి వెంకట హరికృష్ణ జట్టు, తృతీయ బహుమతి షేక్ షారుక్ ఖాన్ జట్టు సాధించినట్టు విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ ముదునూరి నరసింహరాజు తెలిపారు. మహిళల డబుల్స్‌లో మొదటి బహుమతి సృజయ, కల్యాణి జట్టు, ద్వితీయ బహు మతి మరడాని నాగమణి, పద్మ జట్టు, తృతీయ బహు మతి మానుకొండ రేష్మి(శాండీ), లక్ష్మి జట్టు సాధించినట్లు చెప్పారు. అనంతరం యోగా, వ్యాయామం, క్రీడల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ ముదునూరి నరసింహరాజు, యోగా మాస్టర్ దిలీప్ కుమార్, మానుకొండ రేష్మి(శాండీ), జ్ఞానేశ్వరరావు, వాలీబాల్ కోచ్ వెంకట్, పార్క్ వాచ్‌మెన్ రామకృష్ణ దంపతులను సత్కరించారు.

అంతర్జాతీయస్థాయిలో లయన్స్ క్లబ్ సేవలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అంతర్జాతీయ స్థాయిలో లయన్స్ క్లబ్ సేవలు నిర్విరామంగా కొనసాగడానికి ఆయా క్లబ్బుల్లోని సభ్యుల సేవా నిరతే కారణమని క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ పంకజక్షన్ తెలిపారు. స్థానిక లయన్స్ క్లబ్ కమ్యూనిటీ హాలులో జోన్ ఛైర్మన్ పంతగాని వెంకన్న అధ్యక్షతన జోన్ సోషల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ పరిధిలో విశేష సేవలందించిన క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులకు అవార్డులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా గవర్నర్ పంకజాక్షన్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ సభ్యుల పనితీరు అభినందనీయమని తెలిపారు. జోన్ ఛైర్మన్ పంతగాని వెంకన్న మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, కంటి వైద్య శిబిరాలు నిర్వహించడంలో లయన్స్ క్లబులు ముందంజలో ఉన్నాయన్నారు. అనంతరం జోన్ ఛైర్మన్ పంతగాని వెంకన్నను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెండో వైస్ గవర్నర్ కాకరాల వేణుబాబు, జిల్లా కార్యదర్శి మద్దుకూరి శ్రీహరిరావు, రీజనల్ ఛైర్‌పర్సన్ చెన్నకేశవరెడ్డి, జిల్లా నాయకులు అట్లూరి సురేష్, మద్దిపాటి నాగేశ్వరరావు, ఎర్రం రాజు, విజయ రామరాజు, ఉక్కుర్తి సీతారాం, దాసరి శేషు కుమార్ పాల్గొన్నారు.

'మానవత' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - గణపవరం

సమాజంలో అన్ని వర్గాల వారికి మానవత సంస్థ సేవలు అందిస్తుందని ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు(వాసుబాబు) అన్నారు. మానవతా మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కన్యకా పరమేశ్వరి వర్తక సంఘం భవనంలో మంగళవారం వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు మానవత మండల కమిటీ అధ్యక్షులు వంకాయల రామారావు అధ్యక్షత వహించారు. ఈ సభలో ఎంఎల్ఎ వాసుబాబు మాట్లాడుతూ మానవత సంస్థ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ రాష్ట్ర నాయకులు సాగిరాజు జానకిరామరాజు, జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధరం, మండల కమిటీ ఛైర్మన్ కాకర్ల వినాయక, కమిటీ కార్యదర్శి బుద్దారపు పుల్లయ్య, డైరెక్టర్ ఆర్‌విఎస్.రాజు, నాయకులు బొడ్డు శ్రీను, అంజిబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు సలాది రత్నదుర్గకుమారి, సూర్య బలిజ రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, గణపవరం సర్పంచి మూరా అలంకారం, ఉప సర్పంచి దండురాము, మైలవరపు లాలయ్య పాల్గొన్నారు.

వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - చింతలపూడి

అకాల వర్షాలకు నష్టపోయిన మొక్కజొన్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం మండల కార్యదర్శి దొంత కృష్ణ డిమాండ్ చేశారు. రైతు సంఘం మండల కమిటీ సమావేశం రైతు సంఘం అధ్యక్షులు ఎస్‌కె.కాలేషా అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కౌలు రైతుల సమస్యలపై ఈ నెల 28వ తేదీన రాష్ట్ర సదస్సు విజయవాడలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా చింతలపూడి మండల కౌలు రైతుల మహాసభ ఈనెల 26వ తేదీ సమ్మెటవారిగూడెంలో జరుగుతుందని చెప్పారు. తొలుత ఇటీవల చనిపోయిన రైతు సంఘం నాయకులు భూక్య భిక్షాలు మృతికి రెండు నిమిషాలు మౌనాన్ని పాటించారు. ఈ సమావేశంలో పెనుమత్స రాజు, కంచర్ల గురవయ్య, తక్కిలపాటి ప్రసాద్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని జనసేన పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు డిమాండ్ చేశారు. మండలంలో వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న పొగాకు, మొక్కజొన్న, మామిడి, జీడి మామిడి, ములగ పంటలను ఆయన మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వం వెంటనే నష్టపోయిన పంటలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ పసుపులేటి రాము, కొల మధు,సాయి, శాంతి కుమార్, రవి పాల్గొన్నారు.

విద్యార్థులకు రాగిజావ అందజేత

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థులను మరింత ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాగి జావ(మాల్ట్)పంపిణీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని భీమడోలు జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానీరంగా కోరారు. భీమడోలు హైస్కూల్‌తో పాటు గ్రామ పరిధిలోని వివిధ పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాలకు జెడ్‌పిటిసితో పాటు భీమడోలు మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీత మాన్సింగ్, ఎంపిటిసి సభ్యులు ముళ్లగిరి జాన్సన్, స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం ఛైర్మన్ డాక్టర్ పి.మాన్సింగ్, వైసిపి ప్రముఖులు రామకుర్తి నాగేశ్వరరావు,, తుమ్మగుంట రంగా హాజరయ్యారు. భీమడోలులో నిర్వహించిన కార్యక్రమానికి నిర్వాహకురాలిగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పావతి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ పాము కరుణా ప్రియదర్శని పాల్గొన్నారు.

చాట్రాయి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో ప్రభుత్వం పాటు రాగిజావ పంపిణీ చేస్తుంది. రాగి జావా పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని చాట్రాయి జిల్లా పరిషత్ పాఠశాలలో, పర్వతాపురం ఎంపిపి పాఠశాలలో సర్పంచులు దామెర ఉష, మిద్దె శివరామకృష్ణ విద్యార్థులకు రాగిజావను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జి.సత్యనారాయణరెడ్డి, విద్యాకమిటీ ఛైర్మన్ కల్లేపల్లి పిచ్చయ్య పాల్గొన్నారు.

చింతలపూడి : పట్టణంలో జగనన్న గోరుముద్దలో భాగంగా రాగిజావ పంపిణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మోలుగుమాటి నీరజసుధాకర్, వైసిపి పట్టణ అధ్యక్షులు కొప్పుల నాగు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి గ్రంథాలయ ఛైర్మన్ మిర్యాల దిలీప్, వైసిపి మండల నాయకులు వెంపా కృష్ణ, సిటి మెడికల్ దుర్గారావు, ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, ఎంఇఒ రామారావు, గంధం చంటి పాల్గొన్నారు. పట్టణంలో ప్రాథమిక పాఠాశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్షులు దామోధర్ మాట్లాడారు.

బుట్టాయగూడెం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీ కార్యక్రమం జెడ్‌పిటిసి సభ్యులు ఎం.రామతులసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎ డిఒ శ్రీహరి, ఎంఇఒ తెల్లం బాబూరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు గంగాదేవి, ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణపవరం : స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ వాసుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఇఒ పి.శేషు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రభుత్వం పోషక విలువలు గల ఆహారం అందించడంతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్‌ఎంలు కె.రాంబాబు, ఎ.అనురాధ, గ్రామ సర్పంచి మూర అలంకారం, ఉపసర్పంచి దండు రాము, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మండవల్లి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం రాగి జావను కానుకొల్లు సర్పంచి నాగ దాసి థామస్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో విద్య అభ్యసిస్తున్న 38 లక్షల మంది విద్యార్థులకు నాణ్యవంతమైన పౌష్టికాహారం అందుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు అందిపుచ్చుకొని విద్యలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాధవ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలవరం : ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యే శ్రద్ధ వహిస్తుందని గూటాల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు రాఘవన్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావ కార్యక్రమం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ స్వరూప్ పాల్గొన్నారు. రాగిజావ కార్యక్రమాన్ని పాఠశాల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షులు సత్యనారాయణ, గూటాల గ్రామ పంచాయతీ సర్పంచి సిరిపురపు ప్రసాద్ ప్రారంభించారు.

నూజివీడు రూరల్ : రాగిజావ పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గొల్లపల్లి అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గ్రామ పెద్దలు ఎస్‌టిపివి.వెంకటేశ్వర్లు రాగి జావ అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.రాధికారాణి, గ్రామ సర్పంచి భోగినాల వెంకటేశ్వరమ్మ, ఎంపిటిసి సభ్యులు టి.రామయ్య పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాగిజావ పంపిణీ కార్యక్రమంలో ఎంపిపి కె.పోసమ్మ, ఎంఇఒ శ్రీనివాస్ పాల్గొన్నారు. మండలంలోని దర్భగూడెం పంచాయతీలోని లక్ష్మీపురంలో ఉన్నత పాఠశాలలో సర్పంచి సున్నం ఉషారాణి చేతులమీదుగా విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు. పి.అంకంపాలెం ప్రాథమిక పాఠశాలలో ఎంపిటిసి సభ్యులు నాలిశ్రీను పిల్లలకు రాగి జావ అందించారు.

ఉంగుటూరు : ఎంపిపి గంటా శ్రీలక్ష్మి ఉంగుటూరులో, జెడ్‌పిటిసి సభ్యులు కొరిపల్లి జయలక్ష్మి కైకరం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో, సొసైటీ ఛైర్‌పర్సన్ పాపారావు బాబ్జి చేబ్రోలు బాలికల ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. మిగతా గ్రామాల్లో ఆయా సర్పంచులు, అధికార పార్టీ నాయకులు, ఎంపిటిసి సభ్యులు ప్రారంభించారు.

ముదినేపల్లి : ముదినేపల్లి జెడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థులకు రాగిజావ అందించే కార్యక్రమాన్ని జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహా రాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు నిమ్మగడ్డ భిక్షాలు, ఈడే వెంకటేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం వి.ప్రభుదాస్ పాల్గొన్నారు.

కైకలూరు : మండలంలోని భుజబలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, ఎంపిపి అడవి వెంకట కృష్ణ మోహన్, జెడ్‌పిటిసి సభ్యులు కురెళ్ల బేబి, వైస్ ఎంపిపి మహమ్మద్ జహీర్, ఎంపిటిసి సభ్యులు పెనుమత్స సూర్యనారా యణరాజు, సర్పంచి గురజాల రామతులసి, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ ప్రతాప్ కుమార్, ఎంఇఒ దొడ్డా రామారావు, పంచాయతీ కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

దెందులూరు : మండలంలోని పోతునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచి బోదుల స్వరూప్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందించారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక జెడ్‌పి బాలుర హైస్కూల్లో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ ఎలిజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో పర్యటిస్తూ కొందరు విద్యార్థినులు బాక్సులతో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాలు చేయడాన్ని ఎంఎల్ఎ గుర్తించారు. దీనిపై విద్యార్థులను అడగగా అనారోగ్యం వల్ల ప్రత్యేక భోజనం తయారు చేసుకుని తెచ్చుకుంటున్నామని చెప్పారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలు నాణ్యతగా అందించాలని, లేక పోతే సహించ బోమని మధ్యాహ్న భోజన నిర్వాహకులను హెచ్చరించారు. ఆయనతో పాటు ఎంపిపి కొదమ జ్యోతి, జెడ్‌పిటిసి సభ్యులు శ్రీనివాసరావు, వైసిపి పట్టణ అధ్య క్షులు పిపిఎస్.చంద్రరావు పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్, ఎంపిపి రావర్ల కృష్ణకుమారి సుబ్బారావు, ఉపాధ్యాయులు రత్నమాల, బి.సుకుమార్, యువరాజు, రంగారావు, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ రజని పాల్గొన్నారు.

ఎస్ఐబి స్టేషన్ పరిశీలన

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌ను ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్, అడిషనల్ ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం నాగిరెడ్డిగూడెంలో 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు.

ఆలయ టెండర్లపై వాగ్వాదం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఆలయ టెండర్లపై ఎండోమెంట్ అధికారులు, స్థానికుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మండలంలోని గొల్లపల్లి శ్రీ రఘునాథస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు పురస్కరించుకుని నిర్వహించాల్సిన ఏర్పాట్లపై ఎండోమెంట్ అధికారులు టెండర్లను పిలిచారు. టెండర్లు తెరిచే సమయంలో స్థానికులు అభ్యంతరాలు తెలిపారు. దీంతో దేవాదాయ శాఖ అధికారులు, ప్రజల మధ్య వాగ్వాదం నెలకొంది.

డౌన్స్ సిండ్రోమ్‌తో మానసిక మేథో వైకల్యాలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

డౌన్ సిండ్రోమ్ వల్ల చిన్నారుల్లో మానసిక మేథో వైకల్యాలు ఏర్పడతాయని స్థానిక ఎంపియుపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జివి.ప్రభావతిదేవి అన్నారు. స్థానిక భవితా కేంద్రంలో మంగళవారం ప్రపంచ డౌన్స్ సిండ్రోమ్ దినోత్సవం పాఠశాల ఉపాధ్యాయులు జె.శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభావతి దేవి మాట్లాడుతూ క్రోమోజోము లోపం వల్ల చిన్నారుల్లో భౌతిక, మేథో అభివృద్ధి ఉండదని, జన్యుపరమైన లోపాలు ఉంటాయని చెప్పారు. డౌన్ సిండ్రోమ్ ఉన్న వారు దాదాపు భౌతిక, మేథో వైకల్యాలు కలిగి ఉంటారన్నారు. పుట్టుకతో వచ్చే హృదయ లోపం, మూర్ఛరోగం, ల్యుకేమియా, థైరాయిడ్ వ్యాధులు, మానసిక రుగ్మతలు వంటి అనేక ఇతర ఆరోగ్య సమస్యలకు గురవుతారని తెలిపారు.

'టిడిపి ఎంఎల్ఎపై దాడి అమానుషం'

ప్రజాశక్తి - కలిదిండి

రాష్ట్ర అసెంబ్లీలో టిడిపి ఎంఎల్ఎ బాల వీరాంజనేయస్వామిపై వైసిపి ఎంఎల్ఎ దాడి చేయడం అమానుషమని టిడిపి మండల అధ్యక్షులు పోకల జోగిరాజు అన్నారు. ఈ మేరకు కలిదిండి ప్రధాన సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన చేపట్టారు. దాడి చేసిన వైసిపి ఎంఎల్ఎ భేషరతుగా బాల వీరాంజనేయ స్వామికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో ఎఎంసి ఛైర్మన్‌లు వల్లభనేని శ్రీనివాస చౌదరి, తాడినాడ బాబు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు నున్న రమాదేవి, నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ లంకా రత్నారావు, టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శులు అంద్రాజు శ్రీనివాసరావు, గూడవల్లి శ్రీనివాస్, సర్పంచి పరసా వెంకట స్వామి పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం

ప్రజాశక్తి - ముసునూరు

పోషణ పక్షోత్సవాల్లో భాగంగా చిరుధ్యానాలతో న్యూట్రిషన్ కల్గిన పౌష్టికాహారం ఇవ్వాలని సిడిపిఒ ఎస్ఐ.నురాణి అన్నారు. మండలంలోని చింతలవల్లిలో, అక్కిరెడ్డిగూడెంలో పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు మంగళవారం పౌష్టికాహారం అందించారు.

23న ఏలూరులో జిరెల్లి పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

వాటికన్ రాయబారి లియోపోర్డ్ జిరెల్లి ఈ నెల 23న ఏలూరు జిల్లాలో పర్యటించనున్నారని ఏలూరు కతొలిక పీఠాధిపతి పొలిమేర జయరావు తెలిపారు. మంగళవారం ఆయన బిషప్స్ హౌస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. భారతదేశం- నేపాల్ సరిహద్దు కార్డినల్‌గా ఉన్న జిరెల్లి ఈ నెల 23న ఉదయం ఏడు గంటలకు ఏలూరు ఆర్‌సిఎం కథేడ్రల్ దేవాలయంలో దివ్యబలి పూజా నిర్వహిస్తారన్నారు. ఉదయం పది గంటలకు పుర ప్రముఖులతో సమావేశమవుతారని చెప్పారు. మధ్యాహ్నం సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాలను సందర్శిస్తారని తెలిపారు. సాయంత్రం ఏలూరు సందర్శన నిర్మల గిరి పుణ్యక్షేత్రంలో దివ్యబలి పూజ నిర్వహిస్తారని వెల్లడించారు. 25న డాక్టర్ అంథోనీ పూల డెంటల్ కళాశాలలో మెడికల్ క్యాంపు, బ్లడ్ డొనేషన్ క్యాంపు ప్రారంభిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో డెంటల్ కళాశా .కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్, సెయింట్ జాన్స్ బిఇడి కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ పి.బాల, కథేడ్రల్ విచారన గురువు ఫాదర్ మైఖేల్, ప్రాక్యురేటర్ రాజు, ఫాదర్ ఇమ్మానియల్, ఫాదర్ బాబు జార్జి, ఫాదర్ అంథోని పాల్గొన్నారు.